ఒకసారి ఆ రియలైజేషన్ వచ్చాక ఏం చేస్తావూ అన్నది నీ ఇష్టం. నీ కోరికే గానీ గెలిస్తే ప్రహసిత్‌తో గడుపు. నా భర్త నలుగురితో తిరుగుతున్నప్పుడు నేను ఒకరితో తిరిగితే తప్పేమిటి అన్న వాదన అది. దానివల్ల నీకు సుఖం రాలేదనుకో. అసలా ఆలోచనే బావోలేదనుకో నేను భారతీయ స్త్రీని. భర్త ఎలాంటివాడయినా అతడి సహచర్యంలోనే నాకు సంతృప్తి అని గాఢంగా నమ్ముతున్నావనుకో. అప్పుడు అలాగే వుండు".

"అంటే అసలు మనసనేదే లేకుండా ఘర్షణ లేకుండా ఏది దొరికితే దానితో ఆనందిస్తూ బ్రతికెయ్యమంటావా?" అడిగింది లక్ష్మి.

" ఘర్షణ లేకుండా మనసే లేదు. కానీ నువ్వనుకునే ఘర్షణ వేరు. నేను చెప్పే ఘర్షణ వేరు. ఇన్నాళ్ళూ నీ కాపురం ఇంత దరిద్రంగా వుందని నువ్వు చెప్పేవరకూ నాకు తెలియదు. నీ అంతర్గత శక్తులనన్నింటినీ నీ కాపురం బయట వాళ్ళకి మంచిగా కనపడేటందుకే వినియోగిస్తూ వచ్చావు. మనసులోనే కుమిలిపోతూ దానికే ఘర్షణ అని అందమైన పేరు పెట్టుకున్నావు. నీలో నువ్వు కుమిలిపోవటం ఘర్షణ ఎలా అవుతుంది? ఘర్షణ అంటే నీలో రెండు శక్తులు నిజాయితీగా పోరాడాలి. అందులో ఒకటి నెగ్గాలి. దాన్ని నువ్వు ఏ విధమైన గిల్టీ ఫీలింగ్ లేకుండా ఆచరించాలి. తరువాత బాధపడననే నమ్మకం నీకు మనస్ఫూర్తిగా కలగాలి. మరోలా చెప్పాలంటే ఘర్షణ యొక్క అంతిమ లక్ష్యం ఆనందం అయివుండాలి. వేదన కాదు. దీనికే ఒక మంచిపేరు వుంది లక్ష్మి. ప్రతివారూ తెలుసుకోవాల్సిన పేరు అది".

"ఏమిటది?"

"నిర్మాణాత్మకమైన స్వార్థం"

లక్ష్మి కళ్ళు విస్ఫారితం చేసుకుని మధూహ వైపు చూసింది. తన ముందు మామూలుగా ఆడుతూ పాడుతూ సామాన్యమైన ఆడపిల్లలా కనపడే మధూహేనా ఈమె?

కానీ ఇంకా ఏదో అనుమానం.

"మధూ" అంది. "ప్రతివారూ నీలా ఆలోచించి తమ స్వార్థం చూసుకుంటే ఇక ఈ ప్రపంచంలో ఆత్మీయతలూ ఆప్యాయతలూ వుండవు కదా".

"ట్రాష్" అంది మధూహ నిర్లక్ష్యంగా.

ఆమె మొహం ఆవేశంతో ఎర్రబడింది. "ప్రతీవారూ ఇంతకన్నా స్వార్థంతోనే ఆలోచిస్తారు. కానీ పైకి చెప్పరు. నేను చెప్పే స్వార్థంలో ఇతరులకి కలిగే నష్టం ఏమీ లేదు. కేవలం నీ మంచి కోసం నువ్వు ఆలోచించుకునే నిర్మాణాత్మకమైన స్వార్థం కోసం ఎరగా పెడతారు. ఇంతమంది మొగవాళ్ళని చూశాను కదా. ప్రతివారికీ శారీరకంగానో మానసికంగానో మరో స్త్రీతో వివాహత్పూర్వమో తరువాతో ఒక అనుభూతి వుంటుంది. కానీ తమ భార్యలు అలా వుండటాన్ని ఒప్పుకోరు. నువ్వన్న అందమైన ఆ పదాలు ఏమిటవి? ఆత్మీయత, ఆప్యాయత వాటిని భార్య దగ్గిర పెట్టుబడిగా పెడతారు. కుటుంబం, పిల్లలు, సామాజిక భద్రత, నైతిక విలువలు అంటూ భార్యని సెంటిమెంట్‌తో కట్టి పడేసి తమని తాము మోసం చేసుకుంటూ ఆవిడని మోసం చేస్తూ గడుపుతారు".

" ఈ ప్రపంచంలో మొగవాళ్ళందరూ నువ్వు అన్నట్టు లేరు మధూ. భార్యలతో సుఖంగా సంసారాలు చేసుకుంటున్న వారూ ఏకపత్నీ వ్రతులూ కూడా వున్నారు. వారి పేరున గుళ్ళూ, సత్రాలూ, చలివేంద్ర కేంద్రాలూ కట్టబడుగాక. కానీ నేనిక్కడ వ్యక్తుల గురించి మాట్లాడటం లేదు. సిద్ధాంతాల గురించి మాట్లాడుతున్నాను. మొగవాడికొక న్యాయం ఆడదాని కొక న్యాయం ఎందుకని ప్రశ్నిస్తున్నాను. ఒక పక్క భార్యని సుఖపెట్టి మరోపక్క ఆ భర్త తన సుఖం కోసం బయటి ఆనందాన్ని అనుభవిస్తూ భార్యని సంతృప్తిగా వుంచగలిగితే తప్పేం వుంది. ప్రస్తుతం చాలామంది చేస్తున్నది అదే. అది నిర్మాణాత్మకమైన స్వార్థమే కదా"

"బయటి ఆనందమంటే?"

" పరాయి స్త్రీతో సంబంధం కావొచ్చు. స్నేహితులూ, పేకాట... ఏదైనా కావొచ్చు. భార్య కిష్టం లేదని తెలిసి ఆమెను ఇబ్బంది పెట్టకుండా బయట చేసుకునే ఏ పనైనా నిర్మాణాత్మక మైన స్వార్థమే కదా".

" మాటి మాటికీ ఆ పదం వెటకారంగా వాడకు"

లక్ష్మి నొచ్చుకుంటూ "అయ్యో నేనా వుద్దేశంతో అనటం లేదు. ఆ పద ప్రయోగం నచ్చి అంటున్నాను" అంది.

మధూహ కాస్త ఆలోచించి " నువ్వన్నది నిజమే. భర్త బయట ఎలా తిరిగినా తను తన భర్తతో సంతోషంగా వుండగలుగుతున్నానని ఒక స్త్రీ అనుకుంటే అంతకన్నా కావల్సింది ఏముంది?" అంది.

" మరి నువ్వు చెప్పేది ఏమిటి? ఏ మాత్రం కొద్దిగా అసంతృప్తిగా వున్నా సంసారాన్ని విచ్ఛిన్నం చేసుకుని బయట ఆనందాల్ని వెతుక్కోవాలనా? లేక భర్తనీ పిల్లనీ మోసం చేసి దొంగచాటుగా జీవితం రహస్యంగా గడపాలనా?".

" నేను మనుష్యుల  గురించి మాట్లాడుతూంటే నువ్వు స్త్రీల గురించి భార్యల గురించీ మాట్లాడుతున్నావు. అసంతృప్తి అనేది వున్నప్పుడు దాని నుంచి ఎలా బయటపడాలా అన్నది ప్రతి మనిషీ నిరంతరం అన్వేషించవలసిందే అంటున్నాను. అది మానేసి తనలో తానే కుమిలిపోకూడదు అంటూన్నాను".

"ఎవరు చేసినా అదే"

"కాదు కుమిలిపోతారు లేదా నిరంతరం దాని గురించి ఆలోచిస్తూ రాజీ పడిపోయి డిప్రెషన్‌కి లోనై మరింత నష్టపోతారు. ఆత్మవంచన చేసుకుంటారే తప్ప ఆత్మ విమర్శ చేసుకోరు. ఉదాహరణకి నిన్నే తీసుకో - నీకు భర్త వల్ల అసంతృప్తి. బయట పడటానికి రెండు మార్గాలున్నాయి. అతడిని వదిలిపెట్టటం లేదా అతనితోనే వుంటూ సంతోషంగా ఎలా వుండాలా అని ప్రయత్నించటం. మొదటిది సాంఘిక భద్రత దృష్ట్యా సాధ్యం కాదు. రెండో దాంట్లో మళ్ళీ రెండు మార్గాలున్నాయి. అతడితో వుంటూనే రహస్యమైన ఆనందమార్గాలు వెతుక్కోవటమా? లేక వేరే వ్యాపకాల్లో ఆనందం చూసుకోవటమా? చాలా మంది చేసేది రెండోదే. పిల్లల పెంపకం, నగలు, చీరెలు, వగైరా".

"నా కది చేత కాదు".

" పోనీ ప్రహసిత్‌తో వెళ్ళిపోయి అతడిని వివాహం చేసుకుంటావా?"

" నీకేమయినా మతి పోయిందా?"

ఆమె మాటలు మధూహ పట్టించుకోలేదు " నీకా ధైర్యం కూడా వుందని నేననుకోను. అయినా దాన్ని నేనంత సమర్థించను కూడా. ఒక రోజు టెన్నిస్ కోర్టులో నిన్ను చూసి తల మునకలయ్యేటంత ప్రేమలో పడి ఆ తరువాత నువ్వు వివాహితురాలివని తెలిసి అంత తొందరగానూ విత్‌డ్రా అయిపోగలగటం అనేది నాకెప్పటికీ అర్థం కాని ప్రేమ. ఆ మాటే నేనంటే మీరందరూ - అవున్లే ఎలాంటి నిర్మాణాత్మకమైన స్వార్థ పరురాలికి అంత నాజూకైన సెంటిమెంట్లు ఎలా అర్థమవుతాయి? అని ఎగతాళి చేస్తారు. ఇంతకీ నేను చెప్పొచ్చేదేమిటంటే వూరికే నా జీవితం ఇలా అయిపోయింది అని కుమిలిపోకు. మార్గాలు అన్వేషించు. చేతులు కాలినా ఫర్వాలేదు. కానీ ఆనందం కోసం దివిటీ పట్టుకుని వెతుకు. ఏదో ఒక మార్గం దొరక్కపోదు. సూర్యోదయం కాదని తెలిసినప్పుడు చీకట్లో ఏడుస్తూ కూర్చోవటం కంటే తప్పు దార్లో అయినా ఎటో ఒకవైపు ప్రయాణం ప్రారంభించటం మంచిది".

లక్ష్మి కొంచెం సేపు ఆలోచనలో పడి చివరికి తలెత్తి "నువ్వు చెప్పిన ఈ మార్గాలు తప్ప ఇంకేమీ లేవంటావా?" అంది.

మధూహకి ఒళ్ళు మండిపోయింది "ఉంది" అంది.

లక్ష్మి ఆసక్తిగా ముందుకు వంగి " ఏమిటది?" అని అడిగింది.

" నువ్వు ఆత్మహత్య చేసుకోవటం" అని అక్కణ్ణుంచి లేచిపోయింది మధూహ.

మధూహకి పుస్తక విజ్ఞానమే కానీ అనుభవ జ్ఞానం లేదు. అందువల్ల మరో దారేమయినా వుందా? అన్న ప్రశ్నకి సరి అయిన సమాధానం చెప్పలేకపోయింది.

మరో దారి ఉంది.

అదేమిటో ఆమెకి మధూహ గానీ, విష్ణుగానీ చెప్పలేదు.

ప్రహసిత్ చెప్పాడు ఒక అర్థరాత్రి.

“నేను నీకు ఎలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలియటం లేదు. మనుష్యుల్లో దేవతలుంటారని ఏదైనా సినిమాల్లో డైలాగు వింటే నవ్వుకునేవాడిని కానీ ప్రత్యక్షంగా చూస్తున్నాను. సారీ నేను అంధుడిని, చూడలేను కదూ”.

“ అలా మాట్లాడకు రాజు ” అంది మధూహ ఓదార్పుగా అతడు మాములు మనిషి కావటానికి అన్ని రోజులు పట్టింది. గాయాలైతే తగ్గు మొహం పట్టాయి గాని, మొహమంతా వికృతంగా మారిపోయింది.

అతడి ఆస్పత్రి ఖర్చులన్నీ మధూహే భరించింది. అతడింత తొందరగా తేరుకున్నాడంటే మధూహే కారణం.

తన దగ్గిర బంధువు విసిరిన యాసిడ్ వల్ల అతడు అలా అయిపోయాడని ఆమె మనస్సులో చాలా గిల్టీ ఫీలింగ్ వుంది. డాక్టర్ విశాల్ చేసిన మోసానికి రాజు బలయ్యాడు. రాజు పాత్ర కూడా వుండి వుండవచ్చు, కానీ ఇది మరీ దారుణమైన శిక్ష.

కేవలం జాలి వల్లే తనిదంతా చేస్తోందా?

రాజంటే ప్రేమ లేదా?

ఆమె ఆ విషయం అంతగా ఆలోచించలేదు. ఒకప్పుడు ఆమె గుండెల్నిండా అతడంటే ప్రేమ వుండేది. చాలా దారుణంగా ఆమె మనసుని అతడు గాయపరిచాడు. డాక్టర్ విశాల్‌ని ఆశ్రయించాడు డబ్బుకోసం.

అయినా అతడిని చేరదీసింది. లాలించింది. అన్నింటికన్నా ముఖ్యంగా ధైర్యం చెప్పింది. అంధుడైపోయాడన్న భావం అతడిని మానసికంగా కృంగతీసిన సమయంలో అండగా పక్కన నిలవడం. స్త్రీ తన మొదటి ప్రేమని అంత సులభంగా మర్చిపోలేదు. ఆమె విషయంలోనూ అదే జరిగింది.

అయితే అతడి మనసులోని ఒక వికృతమైన మచ్చ ఆమెకి స్పష్టంగా కనబడింది.

దానిని ఒక పీడకలగా మరిచిపోవటానికి ఆమె శాయశక్తులా ప్రయత్నిస్తోంది.

" నువ్వు నాకు ఈ సేవలన్నీ ఎందుకు చేస్తున్నావో అర్థం కావటం లేదు మధూ! అద్దంలో చూసుకోలేకపోయినా నా మొహం ఎంత వికృతంగా వుంటుందో నేను వూహించగలను".

"దయచేసి నువ్వలా మాట్లాడటం మానేస్తావా?"

" నిన్నింకోసారి ఆలోచించుకొమ్మని చెపుతున్నాను. నాకు పైసా రాబడి లేదు. జీవితాంతం నన్ను నువ్వే పోషించవలసి వస్తుంది".

"నీకు తొందర్లో కళ్ళు తిరిగి వచ్చే అవకాశం వుందని డాక్టర్ చెప్పాడు. ఎవరో స్పెషలిస్టు వస్తున్నాడట".

"దానికెంతవుతుంది?"

ఆమె కాస్త తటపటాయించి " పదివేలు" అంది.

" ఎక్కడనించి సంపాదిస్తాం? మామూలు ఆస్పత్రి ఖర్చులకే అప్పు చేసినట్టున్నావ్ కదూ".

ఆమె సమాధానం చెప్పలేదు.

"ఈ సాయంత్రం డాక్టర్ విశాల్ క్లినిక్‌కి తీసుకువెళ్ళు" అన్నాడు.

ఆమె ఆశ్చర్యంగా "ఎందుకు?" అంది.

"చెప్తాగా" అన్నాడు అతడు క్లుప్తంగా.

ఆమెని ముందుగదిలో కూర్చోబెట్టి అతడు లోపలికి వెళ్ళాడు. డాక్టర్ విశాల్ లేడు. పదినిముషాల తరువాత వచ్చాడు.

ఈ లోపులో చిన్న సంఘటన జరిగింది.

ఆమె కూర్చున్న చోటుకి నర్సు వచ్చి "మీరు పేషెంటా?" అని అడిగింది.

" కాదు రాజుతో కలిసి వచ్చాను".

రాజు పేరు చెప్పేసరికి నర్సు "మరిక్కడ కూర్చున్నారేమిటి? రండి" అంటూ లోపలికి తీసుకువెళ్ళి మరో గదిలో కూర్చోబెట్టింది. రాజు డాక్టర్ విశాల్‌కి అంతరంగికుడని అక్కడి స్టాఫ్ అందరికీ తెలుసు. అందుకని మధూహాకి ఆ గౌరవం లభించింది. అయితే రాజు అంధుడవటం వలన మధూహ తన పక్కనుంచి నడిచి వెళ్ళి ఆన్టీ రూమ్‌లో కూర్చున్న సంగతి తెలీదు.

డాక్టర్ విశాల్ రాగానే రాజుతో సంభాషణ ప్రారంభించాడు.

"ఎలా వుంది ఆరోగ్యం ఇప్పుడు?"

"కళ్ళు తప్ప మిగతా అంతా ఓ.కే"

"ఆ ఆసిడ్ విసిరిన వాడు దొరికాడా?"

"లేదు"

"ఇంకేమిటి విశేషాలు?" అడిగాడు విశాల్.

అతడు చాలా పొడిపొడిగా మాట్లాడుతున్నాడన్న విషయం గమనించాడు రాజు.

"నా ఉద్యోగం సంగతి అడుగుదామని వచ్చాను" అన్నాడు డైరెక్టుగా సంభాషణలోకి వస్తూ.

డాక్టర్ విశాల్ మరింత డిప్లమాటిక్‌గా "నీకు జరిగిన అన్యాయానికి నేను చాలా బాధపడుతున్నాను రాజూ. కానీ కళ్ళు లేకుండా నీవిప్పుడు ఏ పని చేయగలవు ?" అన్నాడు.

" నేను మీ క్లినిక్‌లో చేసే పనికి కళ్ళు అవసరం లేదని మీకు తెలుసు "అన్నాడు.

వింటూన్న మధూహ ఉలిక్కిపడింది.

నేను మీ క్లినిక్‌లో చేసేపరికి కళ్ళు అవసరంలేదని  మీకు తెలుసు

చాలా పెక్యూలియర్ వాక్యం. కాంపౌండర్‌కి కళ్ళ అవసరం లేకపోవటం ఏమిటి?

ఈ లోపులో విశాల్ అన్నాడు "ఇన్నాళ్ళూ నువ్వు నాకు చేదోడు వాదోడుగా వుంటూ వచ్చావు. నీ గురించి నేను మర్చిపోను. ఏదో ఒక సాయం చేస్తాను".

"నాకు ఉచిత సహాయం అవసరం లేదు. నేను చేసిన పనికి జీతం ఇస్తే చాలు" అని ఆగి "ముందిచ్చినట్టుగా" అన్నాడు.

డాక్టర్  విశాల్ క్షణం ఆగి "ముందంటే నువ్వు చాలా ఉపయోగపడేవాడివి. నేను లేనప్పుడు ఆపరేషన్లు కూడా చేసేవాడివి. కానీ ఇప్పుడలా కాదుగా, ఆ ఒక్క పనికి తప్ప ఇంక దేనికీ ఉపయోగపడవు" అన్నాడు.

వింటూన్న మధూహ ఉలిక్కిపడింది.

ఆ ఒక్క పనికి తప్ప!
ఏమిటది?

ఆమె ఆలోచన్లలో వుండగానే వారి సంభాషణ కొనసాగటం వినిపించింది.

"అది మాత్రం తక్కువ పనా?" రాజు అంటున్నాడు.